ఆగని మోటార్ల చోరీ

- రాత్రికిరాత్రే మాయం చేస్తున్న దొంగలు
- లబోదిబోమంటున్న రైతులు
- పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని వేడుకోలు


చిలుకూరు పరిధిలోని ఆర్‌కే మేజర్ కాలువపై మోటార్ తీసుకెళ్లి పైపు వదిలేసిన దొంగలు

చిలుకూరు : చిలుకూరు మండలంలోని కాలువ కట్టలపై వ్యవసాయ మోటార్లు వరుసగా దొంగతనాలను గురవుతున్నాయి. దుండగలు రాత్రి సమయంలో చాకచక్యంగా విద్యుత్ మోటార్లను మాయం చేస్తున్నారు. దీంతో రైతులకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. ఉదయం వేళలో మోటార్లు ఉన్న ప్రదేశాలను గుర్తిస్తున్న దొంగలు రాత్రికి రాత్రే చోరీ చేస్తున్నారు. ఇక రైతులు పొద్దున్నే పొలానికి నీరు పెట్టడానికి వచ్చి చూడగా ఖాళీ పైపులు దర్శనమిస్తుండడంతో లబోదిబోమంటున్నారు.

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా..

మండలంలోని రామాపురం ఆర్‌కే మేజర్ కాలువపై నాలుగు రోజుల క్రితం ఒక్క రోజే ఇద్దరు రైతుల విద్యుత్ మోటార్లను దొంగలు అపహరించారు. రామాపురం గ్రామానికి చెందిన పుల్లూరి లచ్చినర్సయ్య అనే రైతుకు చెందిన విద్యుత్ మోటార్ ఆర్‌కే మేజర్ కాలువపై 15 రోజుల క్రితం దొంగతనానికి గురైంది. దీంతో చేతిలో డబ్బులు లేక రూ. 20 వేలు అప్పు చేసి మరో మోటార్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. అయితే లచ్చినర్సయ్య కాలువపై మరో మోటార్ ఏర్పాటు చేసిన రోజు రాత్రే దొంగలు మాయం చేశారు. ఒక్కపక్క వ్యవసాయానికి పెట్టుబడులు పెరిగినా నమ్ముకున్న నేలను వదిలేయలేక వ్యవసాయం చేస్తుంటే ఇలా విద్యుత్ మోటార్లను దొంగలు అపహరించుకుపోయి రైతులను మరింత అప్పుల ఊబిలో నెట్టుతున్నారని ఆ రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇక అదే కాలువపై మరో రైతు పుల్లూరి నాగేశ్వరరావుకు చెందిన విద్యుత్ మోటార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. అంతేకాకుండా ఇదే కాలువపై అదే గ్రామానికి చెందిన వేమూరి శ్రీనుకు చెందిన విద్యుత్ మోటార్ మూడు రోజుల క్రితం దొంగతనానికి గురైంది. దీంతో బాధితులంతా చిలుకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదేవిధంగా ఇటీవల ఆచార్యులగూడెం ఎస్‌ఎస్‌పీ కాలువ కట్టపై రెండు విద్యుత్ మోటార్లు, మండల పరిధిలోని ముక్త్యాల కాలువపై వరుసగా అయిదు విద్యుత్ మోటార్లు దొంగతనానికి గురయ్యాయి. అదేవిధంగా ఆర్‌కే మేజర్ కాలువపై నెలరోజుల క్రితం ముగ్గురు రైతులకు చెందిన విద్యుత్ మోటార్లు దొంగతనంకు గురయ్యాయి. కాగా కాలువ కట్టలపై జరుగుతున్న దొంగతనాలపై బాధిత రైతులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా.. నేటికీ దొంగలు పోలీసులకు చిక్కలేదు. మోటార్ల దొంగతనాలు ఆగలేదు. ఇప్పటికైనా పోలీసులు కాలువ కట్టలపై నిఘా ఏర్పాటు చేసి మోటార్ల దొంగతనాలను అరికట్టాలని మండల రైతులు కోరుతున్నారు.

రెండు మోటార్లు దొంగిలించారు



ఆర్‌కే మేజర్ కాలువపై నేను ఏర్పాటు చేసుకున్న రెండు విద్యుత్ మోటార్లు దొంగిలించారు. ఒక మోటార్ దొంగతనానికి గురైతే మరుసటి రోజు మరో మోటార్ ఏర్పాటు చేసుకున్నాను. మోటార్ ఏర్పాటు చేసిన రాత్రే దొంగలు మాయం చేశారు. నాలాంటి బాధిత రైతులు చాలా మంది ఉన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. పోలీసులు చర్యలు తీసుకోవాలి.

– పుల్లూరి లచ్చినర్సయ్య, బాధిత రైతు, రామాపురం

‘కంటి వెలుగు’పై అవగాహన సమావేశాలు


కోదాడ : సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ శిరీష

కోదాడ : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి కోదాడ మున్సిపల్ చైర్ పర్సన్ వనపర్తి శిరీష కోరారు. కోదాడ మున్సిపాలిటీ పరిధిలో ఈ నెల 18 నుంచి నిర్వహించనున్న కంటి వెలుగు కార్యక్రమంపై పెరిక హాస్టల్‌లో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కంటి వెలుగు కార్యక్రమానికి వచ్చే వారి కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆమె తెలిపారు. వార్డు ఆఫీసర్స్, ఆర్‌పీలు, ఆశ వర్కర్లు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వైస్‌చైర్మన్ వెంపటి పద్మ, కమిషనర్ మహేశ్వరరెడ్డి, వైద్యాధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నడిగూడెం : మండలంలో ఈ నెల 18 నుంచి నిర్వహించనున్న రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ యాతాకుల జ్యోతి కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వైద్యసిబ్బందితో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. కంటి సమస్యలు ఉన్న ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చైతన్య పరచాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ టి.నాగేశ్వరరావు, ఎంపీడీఓ యం.యర్రయ్య, వైస్ ఎంపీపీ బడేటి వెంకటేశ్వర్లు, ఎంపీఓ ఎర్ర లింగారెడ్డి, ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

18 నుంచి ‘కంటి వెలుగు’

మునగాల : కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ ఎలక బిందు కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. వైఎస్ ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య, ఎంపీడీఓ బి.వెంకటేశ్వర్లు, ఎంపీఓ భూపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లోని శ్రీ వేణుగోపాల సీతారామచంద్ర స్వామి ఆలయ ధర్మకర్త మండలికి వచ్చిన దరఖాస్తులను దేవాదాయ ఇన్‌స్పెక్టర్ రమేష్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలికి 19 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కొండారెడ్డి, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత


నాప్కిన్ వెండింగ్ మిషన్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన

హుజూర్‌నగర్ : మహిళల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ గెల్లి అర్చన అన్నారు. హుజూర్‌నగర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్థానిక నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ) శిక్షణ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన సానిటరీ నాప్కిన్ వెండింగ్ మిషన్, ఇన్సినేటర్‌ను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మహిళల వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. జూనియర్ కళాశాల విద్యార్థులకు, మహిళలకు వీటిపై అవగాహన కల్పించారు. మహిళలు వీటిని వినియోగించుకుని ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు గాయత్రి, సౌజన్య, పబ్లిక్ హెల్త్ ఏఈఈ స్వాతి, సానిటరీ ఇన్‌స్పెక్టర్ రజిత, న్యాక్ నిర్వహకులు క్రిష్ణవేణి, శిక్షకులు, మహిళలు పాల్గొన్నారు.

రేపు చిలుకూరులో ముగ్గుల పోటీలు

చిలుకూరు : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈనెల 13వ తేదీన చిలుకూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్వీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం చిలుకూరులో ముగ్గులపోటీల కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కొడారు బాబు, వార్డు సభ్యులు మస్తాన్, కొల్లు సత్యనారాయణ, నాయకులు కొల్లు నర్సయ్య, దొడ్డా గురవయ్య, శ్రీమన్‌నారాయణ, మరీదు శ్రీను, చిలువేరు సురేష్, కొల్లు శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలను జయప్రదం చేయాలి

హుజూర్‌నగర్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జాతీయ బీసీ సంక్షేమ సంఘం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో హుజూర్‌నగర్‌లోని పీర్ల చావడి సెంటర్‌లో ఈనెల 13న ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ధూళిపాల శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు బొడ్డు గోవిందరావు బుధవారం తెలిపారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పోటీలను విజయవంతం చేయాలని వారు కోరారు. ఆ సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి చేపూరి నరసింహాచారి, గూడెపు దీప, కృష్ణ, వెంకన్న, శ్రీనివాస్, బ్రహ్మాచారి పాల్గొన్నారు.

రంగవల్లులు.. తెలుగు సంస్కృతికి ప్రతిబింబాలు

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్


కోదాడఅర్బన్ : కరెన్సీ నోట్లతో అలంకరించిన ముగ్గును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్


నేరేడుచర్ల : విజేతలకు బహుమతులు అందజేస్తున్న తహసీల్దార్ సరిత


నడిగూడెం : ముగ్గులను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ ధనవిజయలక్ష్మి

కోదాడఅర్బన్ : తెలుగు సంస్కృతికి ప్రతిబింబాలు రంగవల్లులని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. బుధవారం కోదాడ పట్టణంలోని 25, 29 వార్డులలో ఆ వార్డు కౌన్సిలర్ల ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలను ఎమ్మెల్యే తిలకించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మన ప్రతి పండుగలో ఒక శాస్త్రీయత దాగి ఉందని, ముగ్గులు వేయడం సంస్కృతితో పాటు ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని అన్నారు. కాగా ఆయా వార్డులలో ముగ్గుల పోటీలలో పాల్గొన్న మహిళలకు ఎమ్మెల్యే కానుకగా చీరలు అందజేశారు. ఎమ్మెల్యేను ఆయా వార్డు కౌన్సిలర్లు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ చింత కవిత, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంపటి పద్మ, కౌన్సిలర్లు చింతల నాగేశ్వరరావు, ఒంటిపులి రమ, కల్లూరు పద్మజ, కోట మధు, గుండెల సూరి, ఖదీర్, ఖాజా, బీఆర్‌ఎస్ నాయకులు చందు నాగేశ్వరారావు, రోజారమణి, మాధవి, లక్ష్మి, భాగ్యమ్మ, లక్ష్మి, ప్రదీప్, వెంకటనారాయణ, రంగారావు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కోదాడ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో..

కోదాడలోని 14వ వార్డు నయానగర్‌లోని ఇమ్మడి మోహన్‌రావు వీధిలో కోదాడ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు వాసవీక్లబ్ ప్రతినిధులు బహుమతులు అందజేశారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక తెలంగాణ

నేరేడుచర్ల : సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక తెలంగాణ అని తహసీల్దార్ వి.సరిత అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బుధవారం నేరేడుచర్లలో వాసవి, వనితా క్లబ్‌లు సంయుక్తంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ క్యాబినేట్ సెక్రటరీ రాచకొండ విజయలక్ష్మి, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ గరిణే అరుణ, జోన్ చైర్మన్లు రాచకొండ శ్రీనివాస్‌రావు, కందిబండ శ్రీనివాస్‌రావు, వాసవి క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొత్త లక్ష్మణ్, జి.కోటేశ్వర్‌రావు, వనిత క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వీరెల్లి శ్రీలత, పొలిశెట్టి సంధ్య, భాగ్యలక్ష్మి, రాచకొండ రాంమోహన్‌రావు, వాసంతి, సుమంత్, వెంకన్న, సత్యనారాయణ తదితరులున్నారు.

నడిగూడెం గురుకుల పాఠశాలలో..

నడిగూడెం : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వేసిన రంగు రంగుల ముగ్గులు ఆకట్టుకున్నాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్.ధనవిజయలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ ఏ.రవికృష్ణ, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో కనుల పండువగా కుడారై ఉత్సవం


గరిడేపల్లి రామాలయంలో కుడారై ఉత్సవంలో పాల్గొన్న మహిళలు


మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కుడారై నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో గల శ్రీగోదాదేవి అమ్మవారికి ధనుర్మాస పూజల్లో భాగంగా బుధవారం విశేష అర్చనలతోపాటు కుడారై ఉత్సవం నిర్వహించారు. అనంతరం మహానివేదనతో ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ధనుర్మాసోత్సవాల్లో చివరిరోజైన మకర సంక్రాంతి రోజున శ్రీగోదాదేవి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్ తెలిపారు.

హుజూర్‌నగర్ : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా హుజూర్‌నగర్‌లోని శ్రీ గోదా పద్మావతి సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి, శ్రీ వేణుగోపాల సీతారామ చంద్రస్వామి ఆలయాల్లో బుధవారం కుడారై ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారామచంద్రస్వామి ఆలయంలో అమ్మవారిని పల్లకిలో అధిష్టింపజేసి ఆలయం చుట్టూ ప్రదక్షిణ గావించారు. అర్చకులు, స్థానాచార్యులు, ఆలయ అధికారులు, ఆలయ అభివృద్ధి సమితి సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

బూరుగడ్డ ఆలయంలో..

హుజూర్‌నగర్‌రూరల్ : ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీ ఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాల స్వామి దేవాలయంలో బుధవారం కుడారై ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, అమ్మవారికి పంచామృతాలతో మంజరి ఉత్సవం, సేవాకాలం, అలంకరణ, మంగళాశాసనం తరదిర కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణా దికారి ఎంపీ లక్ష్మణరావు, మాజీ ధర్మకర్తలు యరగాని రామస్వామి, రాగం లింగయ్య, కిరణ్‌గౌడ్, కనకయ్య, గురుస్వామి అర్చకులు హరీష్‌కుమార్ చార్యులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీగుంటి రఘునాథస్వామి ఆలయంలో..

కోదాడఅర్బన్ : పట్టణంలోని శ్రీ గుంటి రఘునాథస్వామి ఆలయంలో ధనుర్మాస వేడుకల్లో భాగంగా బుధవారం కుడారై ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాలతో చేసిన ప్రసాదాన్ని 108 వెండి గిన్నెలలో ఉంచి గోదాదేవికి సమర్పించారు. తెల్లవారుజామున గోదాదేవికి ప్రధాన అర్చకులు నల్లాన్‌చక్రవర్తుల రాఘవాచార్యులు, శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజలు చేసి తిరుప్పావై పఠనాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త, చైర్మన్ గుడుగుంట్ల రంగయ్య, ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, మధు, రంగారావు, పట్టణ ప్రముఖులు, మహిళలు పాల్గొన్నారు.

గరిడేపల్లి : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని రామాలయంలో బుధవారం గోదాదేవి అమ్మవారికి భక్తులు కుడారై ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు 108 కలశాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో పూజారులు సుదర్శనం, శ్రీనివాసచార్యులు, రామానుజాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

కోదాడరూరల్ : మండల పరిధిలోని తొగర్రాయిలో గల రుక్మిణి సత్యభామ గోదాదేవి సమేత శ్రీ సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో ధనుర్మాస వేడుకల్లో భాగంగా బుధవారం కుడారై ఉత్సవాలను కనుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు శ్రీకృష్ణ.. గోదా అష్టోత్తర పూజ, తిరుప్పావై సేవాతో పాటు 108 గిన్నెల్లో పాయస నివేదన చేశారు. అర్చకులు విష్ణువర్ధనాచార్య, హనుమంతరావు, ఉప సర్పంచ్ సంధ్య, సింగారయ్య ఉన్నారు.

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుల ఎన్నిక

మునగాల : సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా మండలానికి చెందిన ముగ్గురు నాయకులు ఎంపికయ్యారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో వీరిని ఎన్నుకున్నారు. మండలంలోని కలకోవ గ్రామానికి చెందిన బుర్రి శ్రీరాములు, నర్సింహులగూడెం గ్రామానికి చెందిన కోట గోపితో పాటు మేదరమెట్ల వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం వెంకటేశ్వరరావు మునగాలలో విలేకరులతో తెలిపారు. తమను ఎన్నుకున్న జిల్లా కమిటీ సభ్యులు, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో సీపీఎం పార్టీ బలోపేతానికి తాము కృషి చేస్తామని తెలిపారు.

ఆలయ అభివృద్ధికి సహకరిస్తామని హామీ

మఠంపల్లి : మఠంపల్లిలోని శ్రీవేణుగోపాలస్వామి దేవాలయాన్ని స్థానిక సాగర్ సిమెంట్స్ జీఎం హరిదాసు, భాస్కర్‌రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆలయ గోపురం, పూజారి ఇంటి నిర్మాణాలకు పరిశ్రమ తరపున సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ మన్నెం శ్రీనివాసరెడ్డి, ఉప సర్పంచ్ జాలకిరణ్‌యాదవ్, గ్రంథాలయ చైర్మన్ బీవీ రామారావు, మాజీ సర్పంచ్ సుధాకర్‌రెడ్డిలు పరిశ్రమ అధికారులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ నీటి సంఘం చైర్మన్ మన్నెం శేషిరెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు రామచంద్రయ్య, శ్రీనివాస్‌యాదవ్, వీరబాబు, రామలింగయ్య, అర్చకులు అప్పలాచార్యులు, అరవిందాచార్యులు పాల్గొన్నారు.

పేదప్రజలకు త్వరితగతిన రేషన్ బియ్యం పంపిణీ చేయాలి

కోదాడఅర్బన్ : పేద ప్రజలకు త్వరితగతిన రేషన్ బియ్యం పంపిణీ చేయాలని బీజేపీ కోదాడ అసెంబ్లీ కన్వీనర్ కనగాల నారాయణ, సీనియర్ నాయకురాలు నూనె సులోచన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం వారు కోదాడలో విలేకరులతో మాట్లాడారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలు బియ్యం కోసం ఇబ్బందులు పడుతున్నారని, కేంద్ర ప్రభుత్వం రేషన్‌బియ్యం వాటా ప్రకటించినా నేటిని రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను ప్రకటించకపోడంతో రేషన్ దుకాణాల్లో బియ్యం పంపిణీ నిలిచిపోయిందని తెలిపారు. వెంటనే ప్రభుత్వం తన వాటాను ప్రకటించి రేషన్ బియ్యం పంపిణీకి ఆదేశాలు ఇవ్వాలని వారు కోరారు.

మహిళలకు అండగా షీటీమ్


మాట్లాడుతున్న ఎస్ఐ ఇరుగు రవి

మఠంపల్లి : మహిళలకు షీ టీమ్ అండగా నిలుస్తుందని మఠంపల్లి ఎస్ఐ ఇరుగు రవి అన్నారు. మండలంలోని నాగార్జున సిమెంట్స్ పరిశ్రమ సహకారంతో నడుస్తున్న ఎన్‌సీఎల్ పాఠశాల, కళాశాలలో బుధవారం విద్యార్థులకు షీటీమ్స్, భరోసా సెంటర్ ఆధ్వర్యంలో పోలీస్ కళాజాత బృందం ఆటపాటలతో పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవి మాట్లాడారు. సైబర్‌నేరాలు, మానవ అక్రమ రవాణా, లింగ వివక్ష తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో సూర్యాపేట షీటీమ్ ఇన్‌చార్జ్ ఏఎస్ఐ పాండునాయక్, ఎల్లారెడ్డి, జాఫర్, శివరాం, సాయిజ్యోతి, రజిత, సునీత, ప్రిన్సిపాల్ పూర్ణచందర్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, గోవిందు, జయరాములు, మనోహర్‌రెడ్డి, కళాబృందం, యల్లయ్య, గోపయ్య, చారి, నాగార్జున, కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

కోదాడ : మున్సిపాలిటీలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించాలని కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ వనపర్తి శిరీష కోరారు. పట్టణ పరిధిలోని 31వ వార్డులో జరుగుతున్న డ్రెయినేజీ నిర్మాణ పనులను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డులలో డ్రెయినేజీల నిర్మాణానికి నిధులు కేటాయించి పనులను వేగవంతంగా జరుపుతున్నామని తెలిపారు. ఆమె వెంట కౌన్సిలర్లు తిపిరిశెట్టి సుశీల, పెండెం వెంకటేశ్వర్లు, నాయకులు వనపర్తి లక్ష్మీనారాయణ, తిపిరిశెట్టి రాజు, గుండపనేని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషిచేయాలి


బూరుగడ్డలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు గట్టు శ్రీకాంత్‌రెడ్డి

హుజూర్‌నగర్‌రూరల్ : బీజేపీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు గట్టు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం హుజూర్‌నగర్ మండల పరిధిలోని బూరుగడ్డ గ్రామంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి కార్యకర్త పార్టీ గెలుపు కోసం ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బూత్ లెవల్ కమిటీలను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. సమావేశంలో హుజూర్‌నగర్ అసెంబ్లీ కన్వీనర్ వేముల శేఖర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు కోటిరెడ్డి, మాడులగు లక్ష్మీనారాయణ, సతీష్, పాపారావు, శివ, నరేష్, ఖాసీం, బ్రహ్మం, నారాయణ, వెంకన్న, సైదులు, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

పాలకవీడు : రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు గట్టు శ్రీకాంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్ గ్రామంలో నిర్వహించిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులకు సూచించారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొణతం లచ్చిరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ వేముల శేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, రాంబాబు, శేషగిరిరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాంతారెడ్డి మృతి పార్టీకి తీరని లోటు


కాంతారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అనసూర్యమ్మ, తదితరులు

మునగాల : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, సీపీఎం సీనియర్ నాయకుడు ఉప్పుల కాంతారెడ్డి మృతి సీపీఎంకు తీరని లోటని తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు మేదరమెట్ల అనసూర్యమ్మ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో స్వర్గీయ కాంతారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఆనాడు మునగాల పరగణాలో బడుగు, బలహీన వర్గాలు, రైతుల పక్షాన నిలబడి నిరంతర పోరాటం చేసిన వారిలో కాంతారెడ్డి ప్రముఖ పాత్ర వహించారన్నారు. కాంతారెడ్డి ఆశయసాధనకు నేటి యువత కృషిచేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు దేవరం వెంకటరెడ్డి, మిట్టగణుపుల ముత్యాలు, ఆరె.రామకృష్ణారెడ్డి, ఉప్పుల శ్రీనివాసరెడ్డి, సక్కుబాయమ్మ, డా.బలరామ్‌రెడ్డి, డా.అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్లాట్ల అమ్మకంలో మోసం!

చిలుకూరు : తప్పుడు సర్వే నెంబర్‌లో తనకు అక్రమ ప్లాటు అమ్మి మోసం చేశారని మండలంలోని సీత్లా తండా గ్రామానికి చెందిన భుక్యా సంధ్య ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం చిలుకూరులో ఆమె విలేకరులతో మాట్లాడారు. కోదాడకు చెందిన పరాచ హిమబిందు తనకు హుజూర్‌నగర్‌లో ప్లాట్ అమ్మిందని తెలిపారు. అయితే ఆ ప్లాటును తప్పుడు సర్వే నెంబర్‌తో తనకు రిజిస్ట్రేషన్ చేయించి మోసం చేసిందని తెలిపారు. ఆ భూమిలో తాను ఇళ్లు నిర్మించుకోగా పట్టణానికి చెందిన పలువురు దళితులు భూమి తమదని ఇంటి ప్రహరీ కూల్చివేశారని చెప్పారు. ఈ విషయంపై పలుమార్లు రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు


సంబరాల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లోని శ్రీ చైతన్య స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు భోగి పండ్లు పోశారు. పాఠశాల ఆవరణలో రంగు రంగుల ముగ్గులు వేశారు. అనంతరం భోగి మంటలు వేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన చిన్నారుల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చింతలపాలెం డీటీగా ఎండీ వాజీద్ అలీ



హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండల నూతన డిప్యూటీ తహసీల్దార్‌గా ఎండీ వాజీద్ అలీ బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డిప్యూటీ తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉండటంతో పాలకవీడు తహసీల్దార్ కార్యాలయంలో డీటీగా పనిచేస్తున్న ఆయన బదిలీపై చింతలపాలెం వచ్చారు.

సుద్దముక్కపై ‘శాస్త్రి’ ప్రతిమ



కోదాడఅర్బన్ : భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి వర్ధంతిని పురస్కరించుకుని కోదాడకు చెందిన సూక్ష్మ కళాకారుడు వెగ్గలం నరేష్‌చారి బుధవారం అంగుళం సుద్దముక్కపై బహదూర్ శాస్త్రి ప్రతిమను ఆవిష్కరించి దేశభక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు ప్రశంసించారు. నరేష్ గతంలో కూడా స్వాతంత్య్ర సమరయోధులు, దేవుళ్ల ప్రతిమలను ఆవిష్కరించి అనేక అవార్డులు అందుకున్నాడు.

అంగన్‌వాడీ కేంద్రంలో విచారణ

చిలుకూరు : మండలంలోని రామ్‌చంద్రానగర్‌లో గల అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు భోజనం సక్రమంగా పెట్టడం లేదని పిల్లల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం సర్పంచ్ పాయిలీ రమేష్‌తో కలిసి అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉపేంద్ర విచారణ జరిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలోని రికార్డులు పరిశీలించారు. పిల్లలకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు. ఎలాంటి అక్రమాలకు పాల్పడిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యదర్శి బెల్లంకొండ రాముడు, రమేష్ పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

హుజూర్‌నగర్ : గ్రంథాలయాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ చైర్మన్ పి.సంపత్ కోరారు. బుధవారం తన స్వంత ఖర్చులతో వివిధ కాంపిటేటివ్ పుస్తకాలను గ్రంథాలయానికి బహూకరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి శ్రీధర్ రెడ్డి, పాఠకులు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయానికి వెండి కిరీటం బహూకరణ


వెండి కిరీటం అందజేస్తున్న దాత

గరిడేపల్లి : మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో గల శ్రీ ధర్మశాస్త అయ్యప్పస్వామి దేవాలయానికి వెలిదండ గ్రామానికి చెందిన గుండు సురేష్– అనిత దంపతులు 250 గ్రాముల వెండి కిరీటాన్ని బుధవారం ఆలయ కమిటీ చైర్మన్ కీత సోమయ్యకు అందజేశారు. కార్యక్రమంలో సుందరి సత్యనారాయణ, బొల్లెపల్లి శ్రీనివాస్, సుందరి వీర రాఘవయ్య, ముత్తినేని సుబ్బయ్య, సోమయ్య, రామకృష్ణ, గురుస్వామి కీత రామారావు, ఆలయ కమిటీ సభ్యులు, మాలధారులు తదితరులున్నారు.

గూడ్స్ రైలు ఢీకొని రెండు గేదెలు మృతి

మేళ్లచెరువు : గూడ్స్ రైలు ఢీకొని రెండు గేదెలు మృతి చెందగా, ఒక గేదె గాయపడిన ఘటన బుధవారం సాయంత్రం మేళ్లచెరువు మండల కేంద్రం పరిధిలో చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సుంకరబోయిన కనకబాబుకు గల మూడు గేదెలు గ్రామ సమీపంలోని రైల్వేట్రాక్ పక్కన మేత మేస్తూ ట్రాక్ పైకి వచ్చాయి. అదే సమయంలో మేళ్లచెరువు నుంచి జగ్గయ్యపేట వైపు వెళ్తున్న గూడ్స్ రైలు ఢీకొట్టింది. దీంతో రెండు గేదెలు మృతి చెందగా, ఒకటి గాయపడినట్లు తెలిపారు. మృతిచెందిన గేదెల విలువ రెండు లక్షలకు పైగా ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

వివాహానికి చేయూత

నేరేడుచర్ల : మున్సిపాలిటీ పరిధిలోని ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన పేద ముస్లిం కుటుంబానికి చెందిన ఎస్‌కే జానీ–ఫర్వీన్‌ల కుమార్తె జరీనా వివాహానికి బుధవారం జిన్నారెడ్డి ఫౌండేషన్ అధ్యక్షుడు జిన్నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి రూ.5వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆకారపు వెంకటేశ్వర్లు, ఎన్‌టీఆర్‌నగర్ యూత్ నాయకుడు రామస్వామి, సతీష్, రమేష్, శివ తదితరులున్నారు.

వికలాంగుల బంధు ఇవ్వాలి

చిలుకూరు : వికలాంగుల సమస్యల పరిష్కారం కోసం త్వరలో వికలాంగుల రాజ్యాధికార మహాగర్జన సభను చిలుకూరు మండలం కేంద్రంలో నిర్వహించనున్నట్లు భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ తెలిపారు. బుధవారం చిలుకూరులో జరిగిన వికలాంగుల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడా రు. వికలాంగుల బంధు పథకాన్ని అమలు చేసి ప్రతి వికలాంగుడికి రూ.15 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ సంఘం మండల అధ్యక్షుడు పవన్ కుమార్ ఆచార్యులు, టి.చిన వీరయ్య, యల్లయ్య, ఆదినారాయణ పాల్గొన్నారు.